# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 12 , ఆగస్టు ,2026


## బెజ్జూర్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**బెజ్జూర్,ఆగస్టు 11,ప్రభాతవార్త:**

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ను మంగళవారం జిల్లా ఎస్పీ నీతికా పంత్ వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు.పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం పోలీస్ స్టేషన్ లోని వివిధ విభాగాలు,రికార్డులు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు పెండింగ్ కేసులు దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి సిడి ఫైలు రౌడీషీట్లు బైండోవర్ కేసుల వివరాలను ఎస్ఐ సర్తాజ్ పాషాను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేసి,న్యాయమైన దర్యాప్తు ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని,నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను ఓర్పుతో విని చట్ట ప్రకారం త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా సేవా భావంతో విధులు నిర్వహించాలని తెలిపారు.అనంతరం పోలీస్ సిబ్బంది కిట్టును పరిశీలించి వారి శాఖపరమైన అవసరాలు,సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వాహిదుద్దీన్,సిఐ సంతోష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త**



జిల్లాలో నెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములులతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల,నస్పూర్ మండలాల తహసిల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర ఏర్పాట్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిధి సందేశం, జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, పుష్పగుచ్చాలు, వేదిక తయారీ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష



**నిర్మల్, ఆగస్టు 11, ప్రభాతవార్త:**
జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం వరుసగా మూడు కీలక సమీక్షా సమావేశాలు నిర్వహించారు. భద్రత, గణాంకాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రిజిస్టర్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక వ్యవస్థను పరీక్షి ంచారు. పోలీసు సిబ్బంది 24 గంటల పాటు గోదాంకు పటిష్ట భద్రత కల్పించాలని, అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనపై సమీక్షి ంచారు. జిల్లా జనాభా, అక్షరాస్యత, భౌగోళిక పరిస్థితులు, విద్య, వైద్యం, మౌలిక వసతుల వివరాలను శాఖల వారీగా సేకరించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మిగతా 2లో..

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త**



ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పథకం, వంటశాల, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే చర్యలలో భాగంగా చేపట్టిన అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ముల్కల్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్య బోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 11, ప్రభాతవార్త :**



ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గమనించామని తెలిపారు. ఎల్నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ఆలోచించుకోవాలన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు, ఆరుతడి పంటలు సాగు చేసి రైతులు లాభాలు పొందాలని కోరారు.15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీరాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మిగతా 2లో..

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా ఏర్పాటు చేశామని, ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు

## స్మార్ట్ రేషన్ కార్డులపై సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే నివేదికలో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సీపీఓ గంగారెడ్డి, ఆర్డీఓ దేవీదాస్ పాల్గొన్నారు. ఆ తర్వాత ఆగస్టు 15న కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్‌లో జరగనున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షి ంచారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను, లబ్ధిదారులను ఆహ్వానించాలని, తాగునీరు, సీటింగ్, ఎల్ఈడీ తెరల ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ ఫ్యాషన్ డిజైనర్ కోర్సులో కాలేజ్ టాపర్‌గా శ్వేత

**లక్షెట్టిపేట, ఆగస్టు 11, ప్రభాతవార్త**



ఐటిఐ కళాశాలలో ఫ్యాషన్ డిజైనర్ కోర్సులో కళాశాల టాపర్‌గా లింగంపల్లి శ్వేత విజయం సాధించింది. మండలంలోని అంకత్‌పల్లి గ్రామ పంచాయతీలోని శాంతాపూర్‌కు చెందిన సర్పంచ్ లింగంపల్లి వెంకటేష్ లత ల తృతీయ పుత్రిక లింగంపల్లి శ్వేత మంచిర్యాల ఐటిఐలోని కోర్సు ఫ్యాషన్ డిజైనర్ లో మొదటి సంవత్సరం ఫలితాల్లో కాలేజీ ఫస్ట్ ర్యాంకర్‌గా 600కు 531 మార్కులు సంపాదించి కాలేజీలో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసినారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చదివే మార్గమని నమ్మిన కుటుంబాల నుంచి మంచి మార్కులు తెచ్చుకునేలా చదివినందుకు గర్వకారణంగా ఉందని తెలిపారు. అలాగే గ్రామాల్లోని పట్టణాల్లోని పిల్లలందరూ మంచిగా చదువుకొని ప్రతి కోర్సులో మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత స్థానాల్లో నిలిచి, అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాల ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

## ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేసిన కళాశాల ప్రిన్సిపల్ శంకర్

**సారంగాపూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ శంకర్ మంగళవారం ఉచిత నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఒక్కో విద్యార్థికి 12 నోట్ బుక్స్, ఒక బ్యాగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో మానసా దేవి బోనాల జాతర ఘనంగా నిర్వహణ

**బెల్లంపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త**



బెల్లంపల్లి నియోజకవర్గంలోని కెమికల్ ఏరియాలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా మానసా దేవి బోనాల జాతరను మంగళవారం తొలిసారిగా పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. 12వ, 13వ వార్డులకు చెందిన కౌన్సిలర్లు రాజ్‌కుమార్, తిరుమల వాసు ఆధ్వర్యంలో వార్డు ప్రజలు బోనాలతో, డప్పు చప్పుళ్ల నడుమ భారీగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి గీతాలకు అనుగుణంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను రేణికుంట్ల ప్రవీణ్ అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే వివిధ భజన బృందాలకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు హరీష్ శర్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజ్‌కుమార్, తిరుమల వాసుతో పాటు వార్డు నాయకులు గేటు శ్రీనివాస్, గజేందర్, చింతల శ్రీనివాస్, నూనె ప్రభాకర్, రెడ్డి, నెల్లి సమ్మయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**బెల్లంపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి రమాదేవి వినోద్ వెంకటస్వామి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు చిలుముల శంకర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మల్లరపు చిన్నరాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌కే నయీం భాయ్, మాజీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ డీకే రాజలింగం, మాజీ మున్సిపల్ చైర్మన్ గెల్లి రాజలింగు, కౌన్సిలర్ చింతల వసంత, కాంగ్రెస్ నాయకులు కన్నూరి వెంకటేష్ తదితరులు పాల్గొని ఎమ్మెల్యే దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివాహ బంధం కేవలం రెండు మనసుల కలయిక మాత్రమే కాదని, పరస్పర ప్రేమ, గౌరవం, విశ్వాసం, సహకారం, బాధ్యతలతో జీవితాంతం కొనసాగించే పవిత్రమైన బంధమని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకుల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ, సంతోషాలను పంచుకుంటూ ముందుకు సాగడమే ఆదర్శ దాంపత్య జీవితానికి ప్రతీక అని అన్నారు. ప్రజా జీవితంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, ఈ ప్రయాణంలో ఆయనకు రమాదేవి వినోద్ వెంకటస్వామి అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం, కుటుంబ అండదండలు ఎంతో విలువైనవని నాయకులు పేర్కొన్నారు. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానలోని రోగులకు కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ప్రజాసేవా కార్యక్రమంతో వివాహ వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పట్టణ కాంగ్రెస్ కమిటీ నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, 34 వార్డుల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తన వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపినందుకు ఫోన్ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి రమాదేవి దంపతుల దాంపత్య జీవితం ప్రేమ, ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, ప్రశాంతతతో నిండాలని, వారు మరెన్నో వివాహ వార్షికోత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బండి ప్రభాకర్, చిలుముల శంకర్, దేవసాని ఆనంద్, దామెర శ్రీనివాస్, కుంభాల రాజేష్, చింతల వసంత, ఎస్‌కే

## పీఆర్‌టీయూ టీఎస్ తిర్యాని మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**తిర్యాని, ప్రభాతవార్త, ఆగస్టు11;**



పీఆర్‌టీయూ టీఎస్ తిర్యాని మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు దాగం ప్రశాంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా, రాష్ట్ర నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. కాగా పీఆర్‌టీయూ టీఎస్ తిర్యాని మండల నూతన అధ్యక్షుడిగా దాగం ప్రశాంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా దేవ మహేష్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా బదావత్ మీనాక్షి , ఉపాధ్యక్షుడిగా ముత్తే రవి, మహిళా ఉపాధ్యక్షురాలిగా మడావి సమత, కార్యదర్శిగా కొట్నాక విజయ్ కుమార్, మహిళా కార్యదర్శిగా సిహెచ్ సునీతలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ ఎన్నికల అధికారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి జ్ఞానేశ్వర్, జిల్లా నాయకులు జాడి శ్రీనివాస్, జెడ్పీ తిర్యాని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామెర అంజయ్య, జి. వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే 23 నుంచి నిరవధిక సమ్మె: ఆటో యూనియన్ జేఏసీ

**నస్పూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త**




ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 13న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నాయకులు విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఏటా రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో భవన్ నిర్మాణంతో పాటు రూ. 1000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం ప్రభావంతో ఆటో డ్రైవర్ల ఆదాయం తగ్గి ఫైనాన్స్ కిస్తీలు, ఇంటి అద్దెలు చెల్లించలేక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న 200 పైచిలుకు ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. కొత్త త్రీ వీలర్ లైసెన్సుల జారీ నిలుపుదల చేయడం, ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టాలనే ఆలోచనను విరమించుకోవాలని నాయకులు స్పష్టం చేశారు. ఆర్టీసీలో అద్దె బస్సుల మాదిరిగానే అద్దె ఆటోలకు అవకాశం కల్పించి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఈ నెల 17న జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ నాయకులు పొట్ట మధుకర్, చెల్ల విక్రమ్, సుద్దాల రాజు, కట్ట రామ్ కుమార్, తగరం శ్రీనివాస్, ఎండీ హబీబ్ తదితరులు

## అప్రమత్తతే విద్యార్థులకు రక్షణ: నీల్వాయి ఎస్ఐ నాగరాజు

**వేమనపల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త**



విద్యార్థులు చిన్న వయసు నుంచే భద్రతా అంశాలపై అవగాహన కలిగి ఉండాలని నీల్వాయి ఎస్ఐ జి. నాగరాజు సూచించారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థినీ విద్యార్థులకు మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే విషయాన్ని దాచిపెట్టకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కావద్దని, వాటి వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మయూరి, ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి....

**..హర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ ఖాంద్రే విశాల్**

**ఆసిఫాబాద్, ఆగస్టు 11, ప్రభాతవార్త:**

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని హర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ ఖాంద్రే విశాల్ అన్నారు. 80వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9నుండి 17వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఖిహర్ ఘర్ తిరంగాఖి కార్యక్రమం లో భాగంగా మంగళవారం పట్టణంలోని విశాల్ న్యూ లుక్ పవర్ జిమ్‌లో జాతీయ జెండా వేడుకలను వైభవంగా నిర్వహించారు. జిమ్ లో యువకులు జాతీయ జెండాలను చేతుల్లో పట్టుకుని " భారత మాతాకీ జై " "వందేమాతరం "నినాదాలతో తమ దేశభక్తిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఖాంద్రే విశాల్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాల ప్రాముఖ్యతను తెలుపుతూ యువతలో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్యంతో పాటు దేశసేవ భావం, శారీరక దృఢత్వంతో పాటు ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత, ప్రేమ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్, శ్రవణ్, సంతోష్, అ ఖిల్, విలాస్, కార్తీక్, ప్రవీణ్, అమన్, మలిక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సేవే ధ్యేయంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు

**.. సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత**

**...35 మందికి పరీక్షలు.. 15 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమని గుర్తింపు**

**...కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**





ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా శ్రీ [illegible] వెంకటలక్ష్మి [illegible]-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన శిబిరానికి 35 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 15 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో కంటి సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సకు ఎంపిక చేస్తున్నారు. శస్త్రచికిత్సకు ఎంపికైన 15 మందిని సొసైటీ స్వంత ఖర్చులతో బెల్లంపల్లిలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిపారు. వారికి రవాణాతో పాటు భోజన సదుపాయాలను కూడా సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా కల్పించి, కేటరాక్ట్ శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఇప్పటికే శస్త్రచికిత్సలు చేయించుకుని ప్రయోజనం పొందిన వారు తమ పరిచయస్తులు, ఇతర అవసరమైన వారికి ఈ ఉచిత వైద్య సేవలపై అవగాహన కల్పించి శిబిరాలకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులెవరూ నష్టపోకూడదు

**...పెన్షన్ దరఖాస్తులపై సర్పంచ్ వేణుగోపాల్ సూచనలు**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోట వేణుగోపాల్ సూచించారు. బారెగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణను సర్పంచ్ స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు



సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుదారులకు అవసరమైన సహకారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ నష్టపోకుండా గ్రామపంచాయతీ తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపసర్పంచ్ నేరెళ్ల వెంకటేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూటీఎస్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**సిర్పూర్(టి), ఆగస్టు 11, ప్రభాతవార్త :**

పీఆర్టీయూటీఎస్ సంఘం సిర్పూర్(టి) మండల కమిటీ ఎన్నికలు మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏకగ్రీవంగా నిర్వహించినట్లు మండల అధ్యక్షుడు మేడి లక్ష్మీ [illegible]నారాయణ తెలిపారు. 2026-28 సంవత్సరాలకు నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీగా మండల అధ్యక్షుడు మేడి లక్ష్మీ [illegible]నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎల్లల శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షుడు సీతారాం, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రజిని, ఉపాధ్యక్షుడు రహీం, మహిళా ఉపాధ్యక్షురాలు గీత, కార్యదర్శి మహేష్, మహిళా కార్యదర్శి జయశ్రీ, మీడియా కోఆర్డినేటర్ కరుణాకర్, సెక్రటరీ తోటపల్లి రవికుమార్, శ్రీదేవి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కోయవాగులో తాగునీటి సమస్యకు పరిష్కారం

**..నూతన మోటార్ బిగింపు.. నీటి సరఫరా పునరుద్ధరణ**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**






కాగజ్‌నగర్ మండలం కోయవాగు గ్రామపంచాయతీ పరిధిలోని కబరస్థాన్ ప్రాంతంలో తాగునీటి సరఫరా సమస్యకు పరిష్కారం లభించింది. బోరుబావిలో భూమిలో కూరుకుపోయిన పాత మోటార్‌ను జేసీబీ సహాయంతో తొలగించి, నూతన మోటార్‌ను బిగించినట్లు సర్పంచ్ చింతపూరి లక్ష్మి [illegible], ఉపసర్పంచ్ మొరయి శ్రీనివాస్ తెలిపారు. గత కొంతకాలంగా బోరుబావిలో మోటార్ భూమిలో కూరుకుపోవడంతో గ్రామపంచాయతీ పరిధిలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. సమస్యను గుర్తించిన గ్రామపంచాయతీ పాలకవర్గం తక్షణమే స్పందించి జేసీబీ యంత్రం సహాయంతో పాత మోటార్‌ను బయటకు తీయించింది. అనంతరం నూతన మోటార్‌ను కొనుగోలు చేసి బోరులో బిగించడంతోపాటు గ్రామపంచాయతీ ప్రధాన ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి కనెక్షన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ట్యాంకులకు సమృద్ధిగా నీరు చేరుతున్నందున గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా నిరంతరాయంగా నీటి సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించిన సర్పంచ్ చింతపూరి లక్ష్మి [illegible], ఉపసర్పంచ్ మొరయి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుస్మిత, వార్డు సభ్యులు, పంచాయతీ పాలకవర్గం, సిబ్బందికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## పీఆర్టీయూటీఎస్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**సిర్పూర్(టి), ఆగస్టు 11, ప్రభాతవార్త :**

పీఆర్టీయూటీఎస్ సంఘం సిర్పూర్(టి) మండల కమిటీ ఎన్నికలు మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏకగ్రీవంగా నిర్వహించినట్లు మండల అధ్యక్షుడు మేడి లక్ష్మీ [illegible]నారాయణ తెలిపారు. 2026-28 సంవత్సరాలకు నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీగా మండల అధ్యక్షుడు మేడి లక్ష్మీ [illegible]నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎల్లల శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షుడు సీతారాం, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రజిని, ఉపాధ్యక్షుడు రహీం, [illegible] ఉపాధ్యక్షురాలు గీత, కార్యదర్శి మహేష్, మహిళా కార్యదర్శి జయశ్రీ, మీడియా కోఆర్డినేటర్ కరుణాకర్, సెక్రటరీ తోటపల్లి రవికుమార్, శ్రీదేవి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



## అసిస్టెంట్ కుక్ పోస్టుకు

**దరఖాస్తుల ఆహ్వానం**

**.కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఒక అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలోని 18 నుంచి 45 సంవత్సరాల వయసు గల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఏడో తరగతి మెమో, ఇతర విద్యార్హతలు, నివాస ధ్రువపత్రాలు తదితర సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో రెండు సెట్లు జతచేసి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా మండల విద్యా వనరుల కేంద్రంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం మండల విద్యాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఎంఈవో తెలిపారు.



# పట్టా భూమిలో అక్రమంగా మట్టి తీసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**... అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని దంపతుల ఆవేదన**

**తాండూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని అంకెపల్లి గ్రామ శివారు సర్వేనెంబర్ 106/ఎఫ్/2 లో ఉన్న తమ పట్టా భూమిలో అక్రమంగా మట్టి తీసిన షేక్ మోహినిద్దీన్ అనే వ్యక్తిపై అధికారులు వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని తాండూరు మండలం లింగధరి గూడెం గ్రామానికి చెందిన దుర్గం ఉషారాణి విజయ శంకర్ అనే దంపతులు వేడుకున్నారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత మే 25న మొహినుద్దీన్ అనే వ్యక్తి ట్రాక్టర్ సహాయంతో తన పట్టా భూమిలోని మట్టిని తీసి అతని పొలానికి గట్టుగా వేసుకున్నాడని వాపోయారు. తమ పట్టా భూమిలో నుంచి మట్టిని ఎందుకు తీస్తున్నారని మొహినుద్దీన్ అడుగగా, తమను దుర్భాషలాడమే కాకుండా తమకు భూమి లేదని బెదిరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అదేరోజు తాండూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, పోలీసులు స్పందించ లేదన్నారు. జూన్ 17న తాండూర్ తహసిల్దార్ కార్యాలయంలో, జూలై 15న కలెక్టరేట్లో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తమకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. తమ పట్టా భూమిలోని మట్టి తీయడం వల్ల భూమిలో పంట వేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు విచారణ జరిపి బాధ్యునిపై వెంటనే చర్యలు తీసుకొని తమకు తగు న్యాయం చేయాలని దంపతులు విజ్ఞప్తి చేశారు.



# తాండూర్ పిహెచ్సిలో రోగులకు పండ్లు పంపిణీ

**తాండూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి రమదేవి దంపతుల పెళ్లిరోజు పురస్కరించుకొని తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రోగులకు పండ్లు, ఎనర్జీ డ్రింక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సాలిగామ బానయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్, మండల ఉపాధ్యక్షుడు మోమినాలీ, ప్రధాన కార్యదర్శి కటకాల మల్లేష్, కార్యదర్శి సాంబయ్య, మాదారం ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి, మండల సోషల్ మీడియా కో ఆర్డినటర్ దుర్గం మహేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పున్నం గౌడ్, ఎండి గౌస్, జావిద్, చీకటి వెంకటేష్ గౌడ్, తాళ్లపల్లి వెంకట్ గౌడ్, పుట్ట శీను, జీతుల వేణు, ఇందూరి సత్తయ్య, మాసాడి ప్రభాకర్, పెద్ద పోయిన పప్పీ, పెద్ద పోయిన రవి, కొల్లూరి ప్రకాష్. రవి, తదితరులు పాల్గొన్నారు.



# సేంద్రీయ సాగుతో నేల ఆరోగ్యానికి మేలు

## ...మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**





సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను రైతులు ప్రోత్సహించాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వరరావు సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు పొలంలో సేంద్రీయ వ్యవసాయంలో వినియోగించే జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు. పంటల సాగులో అవలంబిస్తున్న వివిధ సాంస్కృతిక, సహజ వ్యవసాయ పద్ధతులను తెలుసుకున్నారు. జీవామృతం తయారీ, వినియోగం, సేంద్రీయ పద్ధతులతో నేల సారాన్ని పెంపొందించుకోవడం, పంటల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంపై రైతుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సేంద్రీయ వ్యవసాయంతో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడంతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రామకృష్ణ తెలిపారు. నాణ్యమైన పంట ఉత్పత్తితో పాటు రైతులకు దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉందన్నారు. సేంద్రీయ సాగును విస్తరించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రభుత్వ సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేపట్టే రైతులకు వ్యవసాయ శాఖ తరఫున అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) సృజన, శ్రీనివాస్, ఏటీఎం శ్రీనివాస్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# నిరాధార ఆరోపణలను ఖండించిన మున్సిపల్ కౌన్సిలర్లు

**ఆసిఫాబాద్, ఆగష్టు 11, ప్రభాతవార్త :**

మున్సిపల్ ఎన్నికలు, చైర్మన్ ఎన్నికల సందర్భంగా మాజీ డీసీసీ అధ్యక్షుడు కె. విశ్వప్రసాద్‌రావుపై డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ చేసిన ఆరోపణలను ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. గురువారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందే విశ్వప్రసాద్‌రావు ఎన్నికల ఏర్పాట్లు చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని తెలిపారు. చైర్మన్ ఎన్నికలో స్వతంత్రంగా గెలిచిన నలుగురు కౌన్సిలర్లను కాంగ్రెస్‌కు మద్దతుగా నిలపడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.1.50 కోట్లు ఖర్చు చేశారంటూ చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నాయకులపై పరస్పరం నిరాధార ఆరోపణలు చేయకుండా వాస్తవాలను ఆధారాలతో వెల్లడించాలని కోరారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు రాపర్తి కార్తిక్, కస్తూరి పుష్పలత, హనుమాన్ల స్వప్నరాణి, కొండు భారతి, ఆత్రం కృష్ణమ్మ, లూనార్ తారాబాయి పాల్గొన్నారు.



# సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలి

**తాండూర్, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తాండూర్ ఎస్సై ప్రసాద్ రావు కోరారు. మామిడి తోటలు, వరి, పత్తి తదితర పంటలు పండించే రైతులు కూడా తమ వ్యవసాయ క్షేత్రాల్లో అతి తక్కువ ధరకు సోలార్ సిసి కెమెరాలు లభిస్తున్నయన్నారు. ఎప్పుడైనా గుర్తు తెలియని వ్యక్తులు రైతుల పొలాలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, పంటలు దొంగలించినట్లయితే సీసీ కెమెరాలు వలన నిందితులను తొందరగా గుర్తించి వారిని పట్టుకోవడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాలు మీ మొబైల్ లో ఎప్పటికప్పుడు మీ వ్యవసాయ క్షేత్రంలో అక్కడి ప్రదేశాన్ని వీక్షి ంచే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఇటీవల స్థానిక చెరువుల వద్ద చేప పిల్లలను ఎవరు ఎత్తుకెళ్లకుండా గంగపుత్ర సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అలాగే ద్వారకపూర్ , కాసిపేట పరిసర ప్రాంతాల్లో కూడా కొద్దీ మంది రైతులు కూడా సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయ రైతులు సి .సి కెమెరాలు ఏర్పాటు చేసుకొని సహకరించాలని కోరారు.



# 25వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

**... వార్డు కౌన్సిలర్ సూరజ్ : డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :

పట్టణంలోని 25వ వార్డు కాలనీలో మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. కాలనీలో మురుగునీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. డ్రైనేజీ పనులు పూర్తయితే కాలనీలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దుర్గం సూరజ్ మాట్లాడుతూ 25వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక ప్రజలు పాల్గొని డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు.



# ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

**ఆసిఫాబాద్ టౌన్, ఆగష్టు 11, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం జెసిబి యంత్రం సహాయంతో బస్టాండ్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన రాకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, డిపో మేనేజర్ రాజశేఖర్ దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్లు సుధాకర్, రామయ్యలతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

